క్లుప్తంగా

ఓటర్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

సుల్తానాబాద్: పోలింగ్ బూత్‌కు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఎంపీవో ఫయాజ్ అలీ, ఏఈ సతీశ్, ఎంఆర్ఐలు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న మిత్రులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన తోటపెల్లి సంతోష్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. వడ్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సంతోష్‌తో కలిసి 2007లో పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆర్థికసాయం అందించారు. మృతుడి కుమారుడు హర్షవర్ధన్‌కు రూ.14,550 అందజేశారు. కార్యక్రమంలో జెట్టి సతీశ్‌తోపాటు మిత్రులు షబ్బీర్, తోటపెల్లి శంకరయ్య, ప్రేమ్, స్వామి, ఆగయ్య, అనగోని మహేందర్, మొగురం అనిల్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సింగిల్‌విండో డైరెక్టర్

ధర్మారం: ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన నిరుపేద వాలుక లక్ష్మీనర్సయ్య అనారోగ్యంతో మరణించారు. కాగా ఆయన కుటుంబానికి మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి బుధవారం పంపించిన రూ.10వేలు సింగిల్‌విండో డైరెక్టర్ మోర కొమురయ్య, సర్పంచ్ రెడపాక ప్రమీల-శ్రీను అందించారు. మాజీ సర్పంచు వాలుక రామయ్య, రామాలయ చైర్మన్ దారవేణి పోశయ్య, దూస సంతోష్, విద్యాకమిటీ చైర్మన్ నేరెళ్ల సతీశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా లక్ష్మణ్‌బాబు



గోదావరిఖని: కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా సుతారి లక్ష్మణ్‌బాబును బుధవారం నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ నియామక పత్రం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో సదానందం

ముత్తారం: మండలంలోని కేశనపల్లికి చెందిన కందుల రమేశ్, అలువోజ్ వెంకటేశ్ బీఆర్ఎస్ నుంచి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెగడ కుమార్, నాయకులు బక్కతట్ల కుమార్, వైద్య రాజేందర్, గీట్ల రమాదేవి, జనార్ధన్‌రెడ్డి, గూట్ల శంకర్ పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ

మంథని: మంథని గౌడ సంఘం అధ్యక్షుడిగా మాచిడి సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. స్థానిక రేణుకా ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తాటి బాలయ్య, కోశాధికారిగా పొన్నం మోహన్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించండి

- ఐటీసీ కేంద్రంగా వందలాది మంది రాకపోకలు
- సత్వరమే హాల్టింగ్ కల్పించాలని కోరుతున్న ప్రయాణికులు



ఐటీసీ బస్‌స్టాప్

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఏరియా, అక్బర్‌నగర్, కుందనపల్లి, బ్రదిపల్లి, మొగల్‌పహాడ్, మల్యాలపల్లి, రాజీవ్ స్వగృహకాలనీ, ఐటీసీ ఇందిరమ్మ కాలనీ వీటన్నింటికీ కనెక్టివిటీగా ఉండేది ఐటీసీ బస్‌స్టాప్. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ బస్సులకు హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తే రామగుండం బైపాస్, లేదంటే బసంత్‌నగర్ బస్టాప్‌లకు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కాలి. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం ఐటీసీ బస్‌స్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్‌లకు అధికారికంగా హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదాయానికి అవకాశం ఉన్నా..

ప్రతిరోజూ ఐటీసీ బస్‌స్టాప్ నుంచి సదరు ప్రాంతాల నుంచి వందలాది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆటోలు, ప్రయివేట్ వాహనాలలో రామగుండం బైపాస్ బస్‌స్టాప్‌కు చేరుకుంటారు. కాగా సదరు బస్టాప్ నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించినా గోదావరిఖని నుంచే ఆర్టీసీ కండక్టర్ టికెట్ ఇస్తుంటారు. కేవలం బైపాస్ రోడ్డు ప్రయాణికుల సౌకర్యార్థం రిక్వెస్ట్ స్టాప్‌గా మాత్రమే ఆర్టీసీ పరిగణిస్తుంది. కాగా ఐటీసీ బస్‌స్టాప్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులకు హాల్టింగ్ కల్పించి ఇక్కడి పాయింట్ నుంచే టికెట్ ఇష్యూ చేసే అవకాశాన్ని పరిశీలిస్తే ఆర్టీసీకి ఆదాయం, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు విన్నవిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



హైదరాబాద్ నుంచి మా గ్రామానికి రావాలంటే అర్ధరాత్రి చేరుకునే బస్సులతో ఇబ్బంది పడుతున్నాం. హైదరాబాద్‌లో ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, రాజధాని బస్సులు ఎక్కే సమయంలోనే డ్రైవర్‌కు ఐటీసీ వద్ద దిగాల్సి ఉంటుందని చెప్పి ఎక్కాల్సి వస్తోంది. దీనికి కొంతమంది డ్రైవర్లు ఓకే చెప్పినా మరికొందరు హాల్టింగ్ లేదని స్పష్టం చేస్తున్నారు. అధికారికంగా హాల్టింగ్ కల్పిస్తే ధైర్యంగా ప్రయాణించవచ్చు. – శరత్, మొగల్‌పహాడ్

బైపాస్ వద్ద దిగితే అదనపు భారం



అక్బర్‌నగర్ ప్రయాణికుడు ఏ సమయంలోనైనా రామగుండం బైపాస్ స్టాప్ వద్ద దిగితే అక్కడి నుంచి ఆటోలో రావాలంటే రూ.30 తీసుకుంటారు. దీంతో రెండు కి.మీల దూరానికి ఆరు కి.మీల తిరగాల్సి వస్తోంది. పెద్దపల్లి నుంచి రామగుండం బైపాస్‌కు చెల్లించే డబ్బులు ఇక్కడ ఆటోకు చెల్లించాల్సి ఉంటుంది. ఐటీసీ వద్ద ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పిస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. – కొండల రాజేందర్‌కుమార్, అక్బర్‌నగర్ ఏరియా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సుల్తానాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ జగదీష్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను పరిశీలించారు. ఎస్సై విజేందర్, పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ జగదీష్



ఓదెల: తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీధర్

వాహనాల తనిఖీ

జూలపల్లి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని గ్రామీణ ప్రధాన రహదారులపై పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. పెద్దాపూర్ వద్ద సీఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సై వెంకటకృష్ణ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ దళం పోలీసులతో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సీఐ జగదీశ్వర్ మాట్లాడుతూ వాహనాదారులు అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, కొత్త వ్యక్తులు కనబడితే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అక్రమంగా డబ్బు తరలిస్తే చర్యలు

ఓదెల: అక్రమంగా వాహనాల్లో డబ్బు తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ అన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శానగొండ, ఇందుర్తి, గుంపుల, పొత్కపల్లి గ్రామాల్లో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల గ్రామంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జమ్మికుంట నుంచి ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర



కమాన్‌పూర్: ఊరేగింపులో మహిళల నృత్యాలు



జ్యోతినగర్: అమ్మవారి సన్నిధిలో మహిళలు



ముత్తారం: దుర్గామాతకు మొక్కుతున్న భక్తులు

జ్యోతినగర్: దేవి శరన్నవరాత్సోవాల ముగింపు సందర్భంగా అమ్మవారి శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో బుధవారం దుర్గాదేవిని ఘనంగా పూజించి డప్పుచప్పుళ్లతో కోలాట ప్రదర్శనతో శోభాయాత్ర నిర్వహించారు.

రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో, సెంటినరీకాలనీలో దుర్గాదేవి నిమజ్జనం బుధవారం వైభవంగా నిర్వహించారు.

ముత్తారం: మండలంలోని కేశనపల్లి, అడవిశ్రీరాంపూర్, ముత్తారం, మచ్చుపేట, లక్కారంలో దుర్గామాత శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బుధవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపు అనంతరం విగ్రహాలను మంథని గోదావరి నదిలో నిమజ్జనానికి తీసుకెళ్లారు.

కమాన్‌పూర్: మండలకేంద్రంతో పాటు గుండారం గ్రామంలో దుర్గామాత నిమజ్జన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కమిటీ సభ్యులు గ్రామాల్లోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఎస్సై బేతి రాములు బందోబస్తు నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత తుర్కల మద్దికుంట



విజేతకు షీల్డు అందిస్తున్న చంద్రశేఖర్

ధర్మారం: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పెద్దపల్లి మండలం మద్దికుంట గ్రామ జట్టు విజేతగా నిలిచింది. దొంగతుర్తి గ్రామానికి చెందిన కీ.శే ఈర్ల చిట్టిబాబు, రమేశ్ జ్ఞాపకార్థం 12 రోజులుగా నిర్వహించిన పోటీలు బుధవారం ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో దొంగతుర్తిపై తుర్కల మద్దికుంట టీం విజయం సాధించింది. విజేతలకు గ్రామ ఉపసర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అలువాల రాజేశం, కెప్టెన్ పరమేశ్, సత్యం, వేల్పుల శంకర్, సాయిరి కుమార్, యాకూబ్, శ్రీను, అంజయ్య, మధు పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో యువత భవిష్యత్ నిర్వీర్యం

యైటింక్లయిన్‌కాలనీ: చెడు అలవాట్లతో యువత తమ భవిష్యత్‌ను నిర్వీర్యం చేసుకుంటోందని జమాత్ ఇస్లామిక్ హింద్ సంస్థ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు హమీదా బేగం, జీఐవో రాష్ట్ర ప్రెసిడెంట్ మసిరా ఫిర్దౌస్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ జమాత్ ఇస్లామిక్ హింద్ లైబ్రరీలో గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'నీ ఉజ్వల భవిష్యత్‌కు నీవే బాట వేసుకో' ప్రచార ఉద్యమ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై దిశా నిర్దేశం చేసే పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జీఐవో గోదావరిఖని శాఖ అధ్యక్షుడు సాజిదా షేక్, ఆసియా బేగం, అధియా షగిస్తా, సారా, జేఐహెచ్ మహిళా అధ్యక్షురాలు సబీరా, సిద్దిఖా, సనా, నస్రి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ ఔషధ మొక్కలతో ఆరోగ్యం

జూలపల్లి: ఔషధ మొక్కలు ప్రాణవాయువును విడుదల చేసి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 10 రకాల ఔషధ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో ఇలాంటి మొక్కలు నాటాలని సూచించారు. వార్డుసభ్యుడు పెద్ది భరత్, హెచ్‌వీ వసంత, ఏఎన్ఎంలు అరుణ, సరిత, లక్ష్మి, రుక్మిణి ఉన్నారు.

✦ నియామకం

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ జిల్లా కమిటీ జనరల్ సెక్రెటరీగా పోతనకాలనీకి చెందిన సొప్పదండి దుర్గాప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

✦ బీఆర్ఎస్ పథకాలతో మాదిగల అభివృద్ధి

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో మాదిగలు అన్ని రంగాలలో ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని మాదిగ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుంచు మల్లేశం మాదిగ అన్నారు. ధర్మారంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో మాదిగలు అణిచివేతకు గురికావడంతో పాటు కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగ కాలనీలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోందన్నారు. దళితబంధు పథకంతో మాదిగలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికలల్లో మాదిగలు బీఆర్ఎస్ పార్టీ వైపు ఉంటారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాదిగ ఐక్యవేదిక నాయకులు బొల్లి నందయ్య, పెర్క భానేష్ ఉన్నారు.

✦ పురోహితులకు సన్మానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో బుధవారం పురోహితులను సన్మానించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ప్రధాన దుకాణ సముదాయంలోని దుర్గా పూజా మండపం ఆవరణలో పురోహితులను ఘనంగా సన్మానించారు. జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్, మోహన్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్ కొలిపాక సుజాత-మల్లయ్య, వివిధ యూనియన్ల ప్రతినిధులు, వినాయక, దుర్గాపూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు'



సర్పంచ్‌లను ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: కాంగ్రెస్‌లో సర్పంచ్‌ల చేరికతో పార్టీ బలోపేతం అవుతోందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పెద్దపల్లి అసెంబ్లీ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు సర్పంచ్ భూర్ల సింధూజ, ధూళికట్ట సర్పంచ్ గొల్లె కావేరి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు భూర్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, అమ్ముల రాములు, మమ్మిడి సమ్మయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, కొండ గట్టయ్య, అట్టెపల్లి శ్రీనివాస్, అక్కెపల్లి మల్లయ్య, గొల్లె శ్రీనివాస్, మారం సాగర్, బండ మల్లయ్య పార్టీలో చేరగా విజ్జన్న వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నాయకులు బుద్దినేని వామన్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, కొండ తిరుపతిగౌడ్, బాలుసాని పర్శరాములుగౌడ్, నరహరి సుధాకర్‌రెడ్డి, పోల్సాని పుల్లారావు, పి.పర్శరాములు, అమ్ముల రమేశ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలోని బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కాగా వారికి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ పొన్నం చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కోటగిరి రమేశ్, నాయకులు అడ్డగుంట శ్రీనివాస్, నితేష్, అశోక్, సతీశ్‌తో పాటు దాదాపు 50మంది చేరారు.

జంగ్ తెలంగాణ

బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి



ప్రచారంలో చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కోరారు. పెద్దపల్లి పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి కాలనీల్లో ప్రచారం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆరాటపడుతున్న దాసరి మనోహర్‌రెడ్డికే అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

దాసరి మనోహర్‌రెడ్డిని ఆశీర్వదించాలి



ఓటు అభ్యర్థిస్తున్న దాసరి పుష్పలత

సుల్తానాబాద్: పేదరిక నిర్మూలనలో ప్రభుత్వం క్రియాశీల పాత్ర పోషిస్తోందని, ప్రజలు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన సతీమణి దాసరి పుష్పలత కోరారు. పట్టణంలోని గుడి మిట్టపల్లి నుంచి బుధవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మరోసారి ముందుకు నడిపించాలని కోరారు. ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, కౌన్సిలర్లు పారుపల్లి జ్ఞానేశ్వరి, పసెడ్ల మమత, గుర్రాల శ్రీనివాస్, నాయకులు ముత్యం రమేశ్ గౌడ్, ఏకశీల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



కొమురయ్యను సన్మానిస్తున్న హనుమయ్య

కాల్వశ్రీరాంపూర్: వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి బహుజనుల ఐక్యత చాటి చెప్పాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హనుమయ్య కోరారు. కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం నిర్వహించిన మండలశాఖ కార్యవర్గ ఎన్నికల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరుస్తూ దేశ రాజకీయాల్లో బీఎస్పీ తనదైన ముద్ర వేసుకుందన్నారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య ఆధ్వర్యంలో కాల్వశ్రీరాంపూర్ మండల నూతన అధ్యక్షుడిగా మావోయిస్టు నేత మాజీ దళ నాయకుడు నిదానపురం కొమురయ్య బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షుడిగా చిలుముల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఐత శ్రీనివాస్, కార్యదర్శి మేర్గువేన సంపత్, కోశాధికారి భీమని సదయ్య, సహాయ కార్యదర్శులు దంతెనపల్లి ప్రవీన్, గాజుల శ్రీకాంత్, కుర్మ మధుకర్, తూలం రాజు ఎన్నికయ్యారు. పెద్దపల్లి అసెంబ్లీ అభ్యర్థి దాసరి ఉష, నాయకులు గోపాల్‌యాదవ్, రియాజ్, కుమ్మరికుంట రవికుమార్, శారద, అనిల్ పాల్గొన్నారు.

చంద్రన్నతోనే సంక్షేమపాలన సాధ్యం



మాట్లాడుతున్న సుదర్శన్

మంథని: గత పాలకులతో మంథని ప్రాంతం వెనుకబడిందని, దళిత లిబరేషన్ ఫ్రంట్ అభ్యర్థిగా మాజీ మావోయిస్టు బందారపు చంద్రన్నను గెలిపిస్తే ఇక్కడ సంక్షేమ పాలన అందుతుందని దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ అన్నారు. పార్టీ అభ్యర్థి చంద్రన్నతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంక్షేమం రావాలంటే చంద్రన్నను గెలిపించుకోవాలన్నారు. ఒకప్పటి దొరల పాలన నేడు మంథనిలో కనిపిస్తోందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జాడలు లేవని ఆరోపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రన్న మాట్లాడుతూ ప్రజల కోసం అనేక ఏళ్లు అడవిలో పోరాటం చేశానని, ఇప్పుడు ప్రజా క్షేత్రంలో ప్రజల కోసం సేవ చేసేందుకు ముందుకు వస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రెవెల్లి శంకర్, సామాజిక ఉద్యమకర్త పోరెడ్డి వెంకటరెడ్డి, నేషనల్ కాంగ్రెస్ పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్ర శివ, మాజీ మావోయిస్టులు జెట్టి చందు, బొమ్మ బాపురెడ్డి, పసుల పోచయ్య, జంజర్ల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ ఏరియాలో బుధవారం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పార్టీ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ నాయకులతో కలసి పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి రామగుండం నియోజకవర్గం అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు దేవనపల్లి చక్రపాణి, నాగరాజు, అవినాష్, రజిత పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

మంథని: గిరిజనులకు పోడు భూముల్లో పట్టాలివ్వాలని మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నాయకపోడు సామాజిక వర్గానికి చెందిన గిరిజనులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ పోడు భూముల సమస్య ఉన్న గ్రామాల్లో కుర్చీ వేసుకొని పోడు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చి గిరిజన పుత్రులను మోసం చేశారని వారు ఆరోపించారు. ఇక్కడ ఉన్న అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులు ఒక్క గిరిజన కుటుంబానికి డివిజన్‌లో పోడుభూమి ఇప్పించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రమంతా కొన్ని ప్రాంతాల్లో పోడుపట్టాలు ఇచ్చినప్పటికీ మంథనిలో ఇవ్వకపోవడం ప్రజాప్రతినిధులకు గిరిజనులపై ఏ రకమైన చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన భూములను హరిత హారం పేరుతో లాక్కోవడం దుర్మార్గమని వారు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్, ఏల్పుల సురేశ్, సత్యం, లక్ష్మి పాల్గొన్నారు.